# ఏనుగు ఏనుగే!

● గుమ్మళ్ల పార్వతి




అది హన్మకొండ చౌరస్తా. కొంచెం అటుగా వరంగల్ వైపు పోయే లోకల్ బస్టాపు. ఇటు ప్రక్క పట్టణ మురికినంతా నెత్తినేసుకుని కంపు కొడుతూ జీవనదిలా పారే పెద్ద ఓపెన్ డ్రయినేజి కాలువ. ఓ ప్రక్క ఎప్పుడూ కిటకిట లాడుతూ కనిపించే టీ, స్నాక్ సెంటర్లు. డ్రయినేజీకి ఇటువైపు ప్రయాణీకుల కోసం ఎదురుచూస్తూ చాంతాడులా వుండే ఆటోలైను. కొంచెం అటుగా పెద్ద పెద్ద రంగు రంగుల చాట్లవలె గుండ్రంగా విప్పారి వున్న రిక్షాల వలయం.

డ్రయినేజీకి కుడివైపు స్థలం పేరు ఏనుగుల గడ్డ. అక్కడ రోజూ ప్రొద్దునే వందల కొద్దీ కష్టజీవులు ఆడ, మగ, పిల్లలనే తేడా లేకుండా, తమ శ్రమని ఆ రోజు ఎవరు కొంటారా అని ఎదురుచూస్తూ వుంటారు. వరంగల్ పట్టణంలో మానవ శ్రమని అమ్ముకునే ఇలాంటి స్థలాలు (అడ్డాలు) దగ్గర దగ్గర ఓ ఇరవై పైనే వుంటాయి. బిల్డింగ్స్‌ని కంట్రాక్టు పద్ధతిన మేస్త్రీలు కట్టిస్తారు. ఈ మేస్త్రీలు ప్రొద్దునే ఏడుగంటలకి ఈ అడ్డాలకి వచ్చి కూలివాండ్లని రోజువారీ వేతనం క్రింద తీసుకుపోతారు. ఆడ, మగ, పిల్లల శ్రమలకి వేరు వేరు లెక్కలుంటాయి.

వీళ్ళంతా పల్లెల్లో బ్రతుకు వెళ్ళదీయలేక, వ్యవసాయం గిట్టుబాటు కాక, అప్పులపాలై వేల సంఖ్యలో పట్టణాలకు గత కొన్నేళ్ళుగా బ్రతకడానికి తరలి వస్తున్నారు. పట్టణాలలో ఎక్కడ ఖాళీ స్థలం కనపడితే అక్కడ గుంపులు గుంపులుగా చిన్న, చిన్న గుడిసెలు వేసుకుని బ్రతుకు వెళ్ళదీస్తారు. వీరి స్థావరాలు మురికి కాలువల వెంట, రైల్వే ట్రాక్ వెంబడి కనపడతాయి. వీళ్ళల్లో ఎక్కువ మంది లంబాడి, మాల, మాదిగ, వడ్డెర తెగకు చెందినవారు.

ప్రొద్దునే నాలుగు గంటలకు లేచి వంటా వార్పు కానిచ్చి, చంటిపిల్లల్ని చంకనేసుకుని, భర్తలకింత, వారికింత అన్నం కట్టుకొని ఏడు గంటల లోపే అడ్డాలకి వస్తారు. మేస్త్రీల అవసరాలను పనినిబట్టి భార్య, భర్త, పిల్లలూ తలా ఓ దిక్కు పనులలోకి పోతారు. పక్షుల్లా సాయంత్రం గుడిసెకు చేరతారు.

అలాంటి కుటుంబమే సాయన్నది. సాయన్నకి ప్రస్తుతం ఓ పదేండ్ల కూతురు, రెండేళ్ల పిల్లవాడు వున్నాడు. చేతికి అందొచ్చిన కొడుకు తన పొలం తాకట్టు పడ్డ సంవత్సరమే ఇల్లు విడిచిపోయాడు. పేరు లచ్చన్న. ఇంత వరకు తిరిగి రాలేదు. తన తండ్రి అమాయకత్వానికి, అశక్తికి జాలి పడుతుండే వాడని, పనిలో తండ్రికి సహాయం చేసే వాడని, వాడుంటే భూమిని తాకట్టు నుంచి విడిపించే వాడని, చాలా మంచివాడని ఆ వూరి ప్రజల మాట.

"ఏవె రామి! ఇంకా లేవ వేందె! తెల్లారొత్తాంది. ఇయ్యాల పనికి బోవా ఏంది?" భార్య నడుం మీద చెయ్యి వేసి కదుపుతూ అన్నాడు.

పట్నం వచ్చి దాదాపు నాల్గు సంవత్సరాలైంది. ఈ నాలుగేళ్లలో ఎండా, వాన అనకుండా కష్టపడని రోజు లేదు. అప్పుల క్రింద తాకట్టుపడ్డ తన తాత ఇచ్చిన ఎకరం పొలాన్ని తిరిగి దక్కించుకోవాల్నని సాయన్న ఉబలాటం.

"ఆ లెత్తన్నగని, కొంచెం ఆగరాదె! పని ఎప్పుడూ వున్నదేనె. నీ పని పాడు గాను" మగత నిద్రలో వున్న రామమ్మ నడుం ప్రక్కకి తిప్పి ముఖం నేల వైపు వరిగించింది.

"ఏందె! గియ్యాల్నా లేత్తనే 'పెదాంతం పుట్టుక్కొత్తాంది. పనికి బోవా ఏంది?" అనుమానం వ్యక్తపరిచాడు సాయన్న.

"పొదాంగని, పని ఏడికి బోద్ది. ఎటన్న వురుకుద్దా ఏంది? అది రోజు వున్నదేనె. ఏం బతుకులో ఏవో" నిట్టూరుస్తూ భర్త వైపు తిరిగి మళ్లీ కళ్లు మూసుకుంది.

'రాత్రి జరిగిన సంఘటన ఆమె కళ్ల ముందు భయంకరంగా మెదులుతూ వుంది. రాత్రంతా మనస్సు కలవరం చెందుతూ నిద్ర పట్టలేదు. రాగానె సాయన్నకి చెబుదామను కుంటే - ఆమె పనిలోంచి వచ్చే సరికే సాయన్న బాగ నిద్రలో వున్నాడు.

"అగో! మళ్లా గదే 'వేదాంతం వల్లిస్తానవ్! ఏవయిందే? గియ్యాల పనికి బోవా ఏంది?" భార్యని ఛాతిపైకి లాక్కుని, అదిమి పట్టుకుని

కొంచెం మందలించాడు. పనికి పోక పోతే పది రూపాయిలు పోతాయని మనస్సులో ఓ మూల భయంగా వుంది.

"గది గాదయా..........." భర్త ఛాతిపైకి వొరుగుతూ మెల్లగా వసిగింది.

"మరి! పనికాడ ఏవన్న అయిందా ఏంది? నాతో చెప్పడాన్కి భయమేందె?" మెల్లిగా బుజ్జగించాడు.

"నా కేంగాలె. కాని, గా బంగ్ల గట్టె ఇంటాయనె మొల్లురోడ్డు కాడ బస్సు గుద్దుకుని టక్కరై అక్కడి కక్కడే సచ్చిపోయిండు. మేం జూతుగగ అంతా రక్తం మడుగే. నా కండ్లు బెయి తిర్గినై. గది నన్ను ఇంకా ఎంటాడుతునె వుంది. భయంగా వుంది. గది యాదికత్తె. ఏం బతుకులో ఏందో! పాపం! మొన్ననే బిడ్డ పెండ్లి జేసిండట! నెలకు నాలుగువేల నౌకరట!" ఇంకా ఏదో ఆలోచిస్తూ అంది.

"ఒస్నియవ్వ పిచ్చిదాన! గిదాన్ని గింత పొడుగుతా ఆలోచన జేత్తనవ్! ఉన్నోడు సచ్చినా, బతికినా ఒక్కటే. ఏనుగు బతికిన ఎయ్యిట, సచ్చినా ఎయ్యిట!" మెల్లగా లేస్తూ గోచి సర్దుకున్నాడు.

"అంటే, గట్లెట్లవుద్ది? సచ్చినోడు తిరిగొత్తాడా ఏంది?" తను పక్క మీద నుండి లేవకుండానే జవాబిచ్చింది.

"సరే, సచ్చినోడు తిర్గి రాడనుకో! కాని గది బస్సు టక్కరి గదా! అదాలత్‌లో కేసు ఎసి ఆర్.టి.సి. వాండ్ల దగ్గర ఎలకు ఎలు లాగుతారు. అదేదో భీమా సంస్థట, అటునుంచో లచ్చ రావచ్చు. సర్కారోడు వాని భార్యకి నెల నెలా కొంత పింఛనిస్తాడు. ఇక వాని నౌకరు వాని కొడుక్కిస్తారు. మనుండి సాధించలేనిది సచ్చి సాధిస్తారు సర్కారు నౌకరు గాండ్లు" చుట్ట ముట్టిస్తూ ఈ మధ్యనే పట్నం వచ్చినాక తనకు తెలిసిన కొన్ని విషయాల్ని విపులీకరించాడు.

"నువ్వు జెప్పిందంతా పొద్దాక దాయి పోస్తున్నప్పుడుగా మేస్త్రీ, నా తోటి కూలి వాండ్లు అనుకోంగ యిన్నగాని. . ."

"సచ్చినోని కుటుంబానికి డబ్బు బాగానే అందుద్దట. యింకో బంగ్లకూడ కట్టొచ్చట. ఆలోచిస్తే భలే సిత్రంగున్నది వాళ్ల బతుకులు. కాని, నాయెల గదిగాదు," సిగ ముడుచుకుంటూ పక్క మీద నుంచి లేచింది.

"మరింకేంది ఆలోచిత్తానవే! ఏవన్నా ఎదాంతం గావాల్న ఏంది"? ఎగతాళి చేసాడు భార్యని.

"ఆ ఎదాంతమే! నీకు గట్లనే ఎగతాళి గుంటది. మొన్నగా డాక్టరుబాబు బంగ్ల కడుతొంటె, గా పనికి పోయిన మన గా గూనిపర్తి పోచవ్వ మొగుడు రాజిగాడు కరెంటు షాట్ గొట్టి అక్కడిగక్కడే సచ్చిపాయె! గీ వూరుగాని వూళ్లె దానం జెయ్యటాన్కి గూడ డబ్బులు కరువాయె! గా డాక్టరు బాబుగాని, మేస్త్రీగాడు గాని శవం దానాని కన్నా డబ్బు లియ్యరైరి. ఏం బతుకులో ఎందో. దరిద్రపోని చావూ దరిద్రమే!" గతం గుర్తు చేసుకుంటూ బ్రతుకు మీద ఈసడింపుతో అంది రామమ్మ.

దాదాపు నెల రోజుల క్రితం గూనిపర్తి గ్రామానికి చెందిన రాజియ్య అనే కూలి హన్మకొండలోని ఎక్సైజ్ కాలనీలో బిల్డింగ్ రెండవ అంతస్తుకి స్లాబ్ పోస్తుంటే సెంట్రింగ్ కూలి క్రింది పడి తలలోకి మేకు దిగు మరణించాడు.

రాజిగాడు చనిపోగానే కూలి వాండ్లు పెద్ద గొడవ చేశారు. కుటుంబానికి ఏదన్నా సహాయం చెయ్యాలని డాక్టరు గారితో గొడవ పడ్డారు. అయితే ఆ తప్పుని సెంట్రింగ్ కట్టిన వర్కర్స్ మీదికి నెట్టి వేస్తూ, దానికి తాను బాధ్యుణ్ణి కాదని, మేస్త్రీ బాధ్యుడని వాదించాడు. ప్రస్తుతం పది లక్షలు పెట్టి కట్టిస్తున్న యింటికి తానే యింకా అప్పు తేవాలి అన్నాడు.

సెంట్రింగ్ ఎవరు కట్టారో తమ కనవసరమని— పని వాండ్లకి రక్షణ కల్పించాల్సిన బాధ్యత డాక్టరు గారిదని— అందులోని ఓ యువకుడు గట్టిగా వాదిస్తూ రాజిగాని కుటుంబానికి నష్ట పరిహారంగా పదివేలు యివ్వాలని తీర్పు నిచ్చారు. కూలి వాండ్లంతా అంతేనని పట్టుబట్టారు.

కాని, డాక్టరుగారి వాదన్ని బలపరిచారు ఆ కాలనీలోని బడా మనుషులు. "యిప్పుడు వీళ్ళకు భయపడి నీవు డబ్బు యిస్తే, యిదో బాటపడి పోతాది," అన్నాడు వర్గ న్యాయంకోరే సుబ్బయ్య.

"కూలికి వచ్చిన వాని 'చావికి' పైసలిస్తంగాని, చావు కిస్తమా ఏంది?!" సిగరెట్టు వెలిగిస్తూ ఆ కాలనీలోని పెద్ద రైల్వే కంట్రాక్టర్ అంజిరెడ్డి.

"సరే బాంచను. వాని కుటుంబాన్ని ఆదుకోక పోయిన, వాని సావు ఖర్చయిన యివ్వండి బాంచను. పుణ్నెం వుంటుంది. దానానికి ఒక్క పైస లేదు. గీ పట్నంల ఎవరిత్తారు?" పాత వ్యవహారం నాటి మనిషి బుచ్చిమల్లు అనే కూలి.

"ఆ ఆ వాని సావు ఖర్చుకేం? మీ పెండ్లాల ముండ గాజుల గ్గాడ డబ్బిస్తం. మాకు యిక్కడ అంతా పుచ్చిపోతాంది. నీ యవ్వ..." బ్లడ్ ప్రెషర్‌తో ఊగి పోతున్న డాక్టరుగారి మామగారు మధ్యలోనే మాట ఆపి వేశాడు.

ఇదంతా విన్నాక, ఆవేశం ఆపుకోలేని ఓ యిద్దరు, ముగ్గురు యువకులు ముందు లేచి డాక్టరు గారింట్లో జొరబడ్డారు. ఆ వెనువెంటనే అనుకున్న కూలివాండ్లు మందకు మంద యింట్లో జొరబడి చేతికందిన వస్తువుల్ని ధ్వంసం చేశారు. డబ్బు, పరపతి గల డాక్టరు పోలీసుల్నిన్ని రంగంలోకి దింపాడు. గొడవకు ముందు నిలచిన వారిని అరెస్టు చేయించి లాకప్‌లో వేయించాడు. శవం పోస్టుమార్టం అయి, దహనం అయిన రెండు

లోకధర్మమును తలపించుచుండుటయే కళా ధర్మముగాని, లోక ధర్మమే కళాధర్మము కాదు. కళా రచన యెప్పుడును లోకమునకు కొంచెము దూరముగా, ఉన్నతముగా నుండును. లోక స్వభావము చక్కగా ప్రతిఫలించు కొరకే యిది లోకమునకు కొంచెము దూరముగా నుండవలెను. అద్దమున ముఖ సౌందర్యము చూచుకొనువారు ఆ యద్దమును తమ ముఖమునకు కొంచెము దూరముగా ఉంచుకొనవలెను. స్వభావ వాదమును పురస్కరించుకొని కళల మూల ధర్మములను ఛేదింప యత్నింపరాదు.

— ఆచార్య పింగళి లక్ష్మీకాంతం

సేకరణ: ఈదువల్లి

రోజుల వరకు పోలీసులు డాక్టరు గారి యింటికి కాపలా కాశారు. మొత్తం మీద పోలీసుల రాకతో గొడవ సద్దు మనిగినట్లయింది.

''యింత జరిగాక కూలి వాండ్లు వూరుకోరని, ఎప్పటికైనా డాక్టరుగారి దగ్గర్నించి తగిన పారితోషికం ఎలాగైనా రాబడ్తారని, వాళ్ళు ఈ మధ్యనే ఏదో సంఘం పెట్టుకుంటున్నారని, సంఘం యొక్క బలాన్ని వారు గుర్తిస్తున్నారని కాలనీలోని బార్లో బడా మనుషుల గుసగుసలు పెట్టుకుంటుండగా....

''ఇవి ఎనుకటి రోజులుగావు. అన్యాయం భరించటాన్కి లేరు. ఏది సేత్తే అది నడువది. నిలదీసి అడుగుతారు. పేదోల్లందరికి గిప్పుడు ఏదో పెద్ద సంఘం వుందట! ఎనుకటికైతే పనికి వచ్చినవారుసత్తే, అది వాని ఖర్మ అని వూరుకునే వారు. కాని యిప్పుడు అంతా తారుమారైంది'', టీ కొట్టుకాడ, కూరగాయల డబ్బాలకాడ గుమిగూడినప్పుడు మామూలు జనం.

''ఏం జేత్తంమరి? నోరు వున్నోందె రాజ్యమట! దుడ్డు వున్నోందె బర్రెట. ఎనుకటి కెవ్వడో జెప్పిండు. మనకేమో సదువురాక పాయె, మాట్లాడ రాకపోయె. గందుకే గే బతుకులు గిట్ల ఏడిశినయె. అయినా గీ మధ్య గదేందో సంఘ పోల్లు చాన చాన చెప్పుతాం(డట. గీ రాజిగాని చావు వార్త గవాళ్ళ దగ్గరికి కూడా పోయిందట. ఆ పోరికి న్యాయం తప్పక జరుగుద్ది'' నోటిలో చుట్ట పెట్టుకుంటూ అన్నాడు సాయన్న.

''ఆ ఏంసంఘమో ఏందో, మన పెద్దోడు పోయి నాల్గేండ్లాయె. అందరూవాడు గా సంఘాల్నే కల్సి పోవచ్చని అంటాంద్రు ఇంత వరకు మొఖమన్న చూపడాయె. మన కట్టాలు మన కొదిలి మంది కట్టాలు తీర్తనని పాయె. యింకా రాకపాయె!' దీపం కోసం అటూ ఇటూ వెదకుతూఅంది.

''ఎవరి రాత ఎట్లుంటె గట్లనె అవుద్దిమరి! తలరాత తప్పుద్దా ఏందీ! రెక్కలొచ్చిన పక్షి వద్దంటే ఎగురకుంట వుంటాది?'' అగ్గిపుల్లగీకి దీపం ముట్టిచ్చాడు.

గల్లీలో దూరం నుంచి వినిపిస్తూన్న టక్ టక్ మనే బూట్ల చప్పుడు దగ్గరైంది. వచ్చి యింటి ముందు ఆగింది.

''అరేయ్ ముసలోడా తలుపు తియ్యరా!'' బూటు కాలుతో తలుపును దభాల్న తన్నాడు సి.ఐ. ఒక్క తన్నుకే తలుపు (కింద పడింది. సి.ఐ., ఎస్.ఐ:తో సహా దాదాపు పది మంది పోలీసులు వచ్చారు.

సాయన్న, రామమ్మ దీపం పట్టుకుని భయంతో వణుకుతూ ఎదురుగా నిల్చున్నారు.

''ఏంరా సాయిగ! నీ కొడుకు యింటికి వచ్చిండట గదర! ఏది కొంచెం ఓసారి చూపిచ్చరా! ఎట్లుంటడో చూస్తం!'' విషపు నవ్వు నవ్వుతూ ఎగతాళి చేశాడు సి.ఐ.

''రాలేదు బాంచను. వాడు గనపడక నాల్గేండ్లయింది. కండ్లల్ల వత్తులేసుకుని చూత్తన్నం. నీ బాంచను. కాల్మొక్త వాడెక్కడ పజ్జేసుకుని బతుకుతాండు. వానికి మామీద కనికరమే లేదు''రెండు చేతులు జోడిస్తూ రామమ్మ.

''అన్న నీయవ్వ! నువు భలే టక్కరి దానవె'' ఎస్.ఐ. లాఠీ ఝుళిపించాడు భయపెట్టటానికి.

''అది గాదె రామి! మొన్నగా డాక్టరుగారి యింటి పనిలో చనిపోయిన గా మానిపర్తి దాడిగాని కుటుంబానికి పదివేలు యియ్యాలనియివ్వకపోతే బాగుండదనీ, ఎన్నడూ లేంది మీ మాలోండ్లు గట్టిగ అడుగుతున్నరట. వారికి నీ కొడుకు కొత్త కొత్త పాఠాలు నూరి పోత్తాండట. వాని బలంతోటె కూలోండ్లు కయ్యానికి కాలు దువ్వుతున్నరట. గా డాక్టరు సంగతి మీకు తెల్వది. ఆయనతో పెట్టుకుంటె మీరు, మీ గుడిసె అ(డసు లేకుండ పోతవి. అర్థమైందా! వాన్ని మర్యాదగ మాకు అప్పగించండి! లేకపోతె మాకు దొరికితే మా చేతుల్లో చావు తప్పది. ఏంరా ముసలోడ! కొడుకుని దేశం మీదికి దోలి ఎడ్డో కోలిగ కూచున్నావ్!'' సాయన్న తలవంచి వీపుమీద రెండు, డొక్కలో రెండు గుద్దాడు సి.ఐ. ఈ గొడవకి చిన్నపిల్లలిద్దరూ ఒక్కవుదుటున లేచి భావురుమన్నారు.

పోలీసులు గుడిసెలోకి జొరబడి చేతికిందింది అందినట్టే ధ్వంసం చేశారు. వాళ్ళ (పవర్తన నిప్పులు (తొక్కిన కోతిలాగుంది.

''ఏమ్మో బాంచను. మాకేం తెల్వది. కూలి వుంటె తింటాం. లేకపోతె పంటాం. కూలి నాలి జేసుకునేవోళ్ళం. గా రాజకీయం, గా పార్టీలు గా సంఘాలు మాకు తెల్వదు. ముసలోన్ని కొట్టకండి బాంచను''(కింద పడి వాళ్ళ కాళ్ళు (మొక్కుతూ రోదిస్తోంది.

''గదంత మాకు తెల్వదు. నీయక్క, నీ కొడుకు యిప్పుడు ఈ జిల్లాకి పెద్ద లీడరట! పెద్ద పెద్ద వాట్లల్లో వాని చెయ్యున్నదట! గే పంచాయతిల కూడా వాని పేరె బాగ వినత్తాంది. వాడు యిక్కన్నే, ఎక్కన్నో చుట్టుపక్కల వున్నట్టు వున్నాడు. నీయక్క.. అరె ముసలోడ! వాడు దొరికే వరకు నువ్వు స్టేషన్లో కూసుందువుగాని రార!'' అనగానె, నలుగురైదుగురు సాయన్న రెక్కలు వెనక్కి యిరిచి కట్టి సి.ఐ.ని ఫాలో అయ్యారు.

రామమ్మ లబోదిబోమనీ మొత్తుకుంటూ కాళ్ళమీద పడి (బతిమాలింది. ఆమె రోద ఉక్కు పాదాలకి వినిపించలేదు. సాయన్నని గల్లీ చివరలో వున్న జీపు వరకు నడిపించి, ఆ తర్వాత జీపులో వేసుకుని పోయారు.

రామమ్మ జీపు పోయేవరకు అటువైపే చూస్తూ నిలబడి, ఓసారి గట్టిగా నిట్టూర్చింది. ఇప్పుడు ఏదో తెలియని తృప్తి తన కడుపుని నింపింది. హాయిగా గాలి పీల్చుకుంటూ గుడిసె వైపు నడిచింది. ఎప్పుడూ లేంది ఈసారి అడుగులు ఎంతో తేలిగ్గా పడుతున్నాయి. శరీరం తేలికైంది.

తన కొడుకు యింతవాడై తన కష్టాల్ని చూడకున్న యితరుల కష్టాలకు పరిష్కారం వెదకుతున్నట్టు యిప్పుడు అర్థమైంది. ఇన్నాళ్ళు కొడుకు ఏమైపోయాడోనని బెంగతో తెగ ఏడ్చేది. కాని యిప్పుడు తన కొడుకు తన చుట్టే వున్నాడు. అంతటా వాడె. యిప్పుడు వాని రాక కోసం ఎదిరి చూసె తల్లులెందరో! 'వాడు నాకె కొడుకు కాదు. ఎందరికో!' తన మనస్సు పులకించిపోతోంది.

భర్త పోలీసు స్టేషనుకు పోయినందుకు యిప్పుడు బాధలేదు. తన కొడుకు దిక్కులేని రాజిగాని కుటుంబాల లాంటి వారి కష్టాల్ని కడతేర్చే బాటలో పయనిస్తున్నాడన్న సంతోషంతో కళ్ళు చెమర్చాయి.

''అవ్వా నేనిక్కడే వున్నాను. నీ కోసం, నీలాంటి తల్లుల కష్టాల్ని కడతేర్చడం కోసం, యిదిగో యిక్కడే వున్నానవ్వా రా! సత్యంలా అంతటా నేనె. నీ బిడ్డనే, కౌగలించుకో అవ్వా! ఈ గుండె చప్పుళ్ళు విను! యివి నీవె తల్లి!''

అష్టదిక్కుల నుండి ధ్వనిస్తూన్న ఆ పిలుపులు చెవులో గింగురుమంటున్నాయి. చెమ్మగిల్లిన కళ్ళను కొంగుతో తుడుచుకొంది. ఏదో స్ఫురించిన దానిలా కొంగును బిగ్గరగా నడుముకి చుట్టుకుంటూ గుడిసెలోకి అడుగుపెట్టి బిక్కచచ్చివున్న యిద్దరు పిల్లల్ని కావిలించుకుంది.

■